సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.62.72లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 4 నుంచి 30వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని శనివారం లెక్కించారు. రూ.62,72,577 నగదు, 79 గ్రాముల బంగారం ,730 గ్రాముల వెండితో పాటు 5,101 యూఎస్ఏ డాలర్లు, 20 పౌండ్ స్టెర్లింగ్స్(స్కాట్‌లాండ్), 5 యూఏఈ దిర్హామ్, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 5 యూరోలు వచ్చాయి. ఈవో శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉమా నీలకంఠేశ్వర స్వామి ఈవో పీఎల్ఎన్ రాజు, శ్రీహరి సేవా సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ డైరెక్టర్‌గా ఏడీసీ శ్రీనివాస్



దాబాగార్డెన్స్: జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావును అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ జీవీఎంసీ స్పోర్ట్స్ సెక్రటరీగా ఉంటున్న శ్రీనివాసరావును జాయింట్ డైరెక్టర్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు ఆయన్ని అభినందించారు.

మరో ఇద్దరికి కరోనా

మహారాణిపేట: విశాఖలో శనివారం మరో ఇద్దరికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 110 మందికి పరీక్షలు చేయగా, వీరిలో ఇద్దరికి కరోనా నిర్ధారణ అయింది. ఆరుగురు హోమ్ ఐసోలేషన్‌లో, నలుగురు ఆస్పత్రుల్లో, తొమ్మిది డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు తెలిపారు.

గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: పండగ సీజన్ కావడంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 10 వరకు, తిరుగు ప్రయాణంలో రాయగడ-గుంటూరు(17244)ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 11 వరకు 2-స్లీపర్ క్లాస్, 1-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

గుణుపూర్ పాసింజర్ స్పెషల్ రద్దు

వాల్తేర్ డివిజన్, నౌపడ-పర్లాకిమిడి స్టేషన్‌ల మధ్య పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున విశాఖపట్నం-గుణుపూర్(08522/08521) పాసింజర్ స్పెషల్ జనవరి 3, 7, 10, 14, 17, 21, 24, 28, 31 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ఉష సత్తా



ఉషను అభినందిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన ఎస్.జలఉష సత్తాచాటింది. ఈ నెల 24, 25వ తేదీల్లో ప్రకాశం జిల్లా రామయ్యపట్నం పోర్ట్ గ్రాండ్స్‌లో ఈ పోటీలు జరిగాయి. 50+ మహిళల కేటగిరీలో ఫీల్డ్ అంశాలు షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రో పాల్గొని మూడింట విజేతగా నిలిచి స్వర్ణాలందుకుంది. ముంబయిలో ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం ఉష మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈ సందర్భంగా ఉషను సీపీ రవిశంకర్, పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

కరెంట్ 'షాక్'లు ఉండవిక!

ఇళ్లు, దాబాలు, పొలాల మీదుగా వెళ్లే విద్యుత్ వైర్లతో ఇక అవస్థలు ఉండవు. అవి షాక్ కొడతాయన్న భయపడక్కర్లేదు. ఎందుకంటే షాక్ కొట్టని విద్యుత్ వైర్లు వస్తున్నాయి. ఈపీడీసీఎల్ పరిధిలో ఈ తరహా వైర్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పోలాండ్, స్వీడన్ తరహాలో విశాఖ సర్కిల్ పరిధిలో ఇక్కడ కవర్డ్ కండక్టర్లు ఏర్పాటుకు ఈపీడీసీఎల్ అధికారులు అంచనాలు రూపొందించారు. తొలి విడతలో గ్రామీణ ప్రాంతాల్లో 11కేవీ, 33కేవీ లైన్స్‌కు ఏర్పాటు చేయనున్నారు.





- భారీ విద్యుత్ తీగలకు కవర్డ్ కండక్టర్లు
- ఏర్పాటుకు ఈపీడీసీఎల్ ప్రణాళికలు
- 11 కేవీ లైన్స్‌కు 99 చ.మి.మీ కవర్డ్ కండక్టర్లు
- 33కేవీ లైన్స్‌కు 120 చ.మిమీ కవర్డ్ కండక్టర్లు ఏర్పాట్లు
- రూ.52.74 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అమలుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం : పెద్ద గాలి వీచినా.. భారీ వర్షాలు కురిసినా.. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగిపడుతుంటాయి. దీనివల్ల వైర్లు తెగిపడి తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంటాయి. సరఫరా పునరుద్ధరించేందుకు చాలా సమయం పడుతుంటుంది. దీంతో వాటిని సరి చేసేందుకు ఏటా ఖర్చులు తడిసిమోపెడవుతోంది. పైగా.. కొన్ని సార్లు ప్రాణ నష్టం కూడా సంభవిస్తోంది. వీటన్నింటిపై దృష్టిసారించిన ఈపీడీసీఎల్.. స్వీడన్, పోలాండ్‌లో ఉన్న కవర్డ్ కండక్టర్ల విధానం తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇంటి కనెక్షన్లకు వినియోగించే సర్వీస్ వైర్ల మాదిరిగా భారీ విద్యుత్ వైర్లకు కూడా పటిష్టమైన కవర్డ్ కండక్టర్లు ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది.

గ్రామీణ పరిధిలో ప్రారంభించేలా..

ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు పునరుద్ధరింపబడిన పంపిణీ రంగ పథకం(ఆర్‌డీఎస్ఎస్) నిధులను వినియోగించుకోనుంది. కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అల్యూమినియం కండక్టర్లు వినియోగిస్తున్నారు. చిన్న కొమ్మ తగిలినా.. లైన్ ట్రిప్ అయిపోతుంది. దాన్ని కవర్ చేయనున్నారు. అల్యూమినియం కండక్టర్లకు అత్యంత ధృడమైన ఇన్సులేటెడ్ కవర్‌తో ఉంటాయి. వీటిపై కొమ్మలు పడినా.. ఏవైనా పక్షులు వాలినా.. ట్రిప్ అయ్యే అవకాశం ఉండదు. ఇందులో భాగంగా.. రెండు విభాగాల్లో ఈ కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయనున్నారు. 11కేవీ, 33కేవీ లైన్లని పూర్తిగా కవర్డ్ కండక్టర్లుగా మార్చనున్నారు. 146 కి.మీ పరిధిలో రూ.45.81 కోట్లతో 99 చ.మిమీ మీటర్ల మందంతో ఉన్న కవర్డ్ కండక్టర్లని 11 కేవీ లైన్లలో ఏర్పాటు చేయనున్నారు. వీటికోసం 9.5 మీటర్ల పోల్స్ కూడా ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా 120 చ.మిమీ మందంతో ఉన్న కవర్డ్ కండక్టర్లను 16 కి.మీ మేర 33 కేవీ లైన్‌లో రానున్నాయి. వీటిని పటిష్టంగా ఉంచేందుకు 12.5 మీటర్ల పోల్స్‌ని వాడనున్నారు. ఇందుకోసం రూ.6.93 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు వేశారు. వీటికి సంబంధించిన ప్రపోజల్స్‌ని ఇప్పటికే సంబంధిత విభాగానికి పంపించగా.. అనుమతులు వచ్చాయి. త్వరలోనే కొరుప్రోలు, యలమంచిలి, నర్సీపట్నం, రావికమతం, చోడవరం, సబ్బవరం, ఇలా.. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో కవర్డ్ కండక్టర్ల ఏర్పాటు పనులు మొదలు పెట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

నిర్వహణ సులభతరం



సీఎండీ మార్గదర్శకాల మేరకు విశాఖ సర్కిల్ పరిధిలోనూ కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇవి ఏర్పాటు చేస్తే.. నిర్వహణ భారం చాలా వరకూ తగ్గుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ కండక్టర్లు గాలుల కారణంగా రెండూ కలిసిపోతే.. మంటలు చెలరేగి.. సరఫరా నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని ఏర్పాటు చేయడం వల్ల గాలులకు రెండు వైర్లు కలిసిపోయినా ఎలాంటి ప్రమాదం జరగదు. ఖర్చు ఎక్కువే అయినా.. ప్రజల భద్రతకు సంబంధించిన అంశంపై ఈపీడీసీఎల్ ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటోంది.

– ఎల్.మహేంద్రనాథ్, ఈపీడీసీఎల్ ఎస్ఈ

న్యూ ఇయర్ వేడుకలకు ట్రాఫిక్ నిబంధనలు



బందోబస్తు చర్యలపై పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా నగర పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దృష్టి సారిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సురక్షితంగా, ఆనందోత్సాహాలతో చేసుకుంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

- వాహనదారుల భద్రత దృష్ట్యా 31వ తేదీ రాత్రి 8 నుంచి 1వ తేదీ తెల్లవారుజాము 5 గంటల వరకు వేమన మందిరం నుంచి డీఎల్‌ఓ జంక్షన్ వరకు గల ఫ్లై ఓవర్‌పై వాహనాలు, పాదచారుల రాకపోకలకు అనుమతిలేదు.
- 1వ తేదీన సంపత్ వినాయక గుడి వద్ద వాహనాలకు పూజలు చేసుకునే వారు గోకి సన్స్ నుంచి కళామందిర్ వరకు రోడ్డుకి ఎడమ వైపున అదే విధంగా రోడ్డుకు కుడి వైపున జీవీఎంసీ కమిషనర్ బంగ్లా నుంచి వేమన మందిరం వరకు ఒకే వరుసలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. గుడి ముందు వాహన పూజలు అనుమతించరు.
- పార్క్ హోటల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు 31వ తేదీ రాత్రి 8 నుంచి 1వ తేదీ తెల్లవారుజాము 5 గంటల వరకు ఎలాంటి వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు అనుమతి లేదు.
- 31వ తేదీ రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు బీఆర్‌టీఎస్ రోడ్ హనుమంతవాక నుంచి అడవివరం జంక్షన్, పాత గోశాల జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్, పెందుర్తి జంక్షన్ నుంచి ఎన్ఏడీ మీదుగా కాన్వెంట్ వరకు మధ్య రోడ్డు మూసివేస్తారు.
- అత్యవసర వాహనాలు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డులో ప్రయాణించాలి. వాహనదారుల భద్రత దృష్ట్యా రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు మద్దిలపాలెం జంక్షన్ నుంచి రామా టాకీస్ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్య లైను, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అండర్ పాస్‌ను మూసివేస్తారు.

31వ తేదీ రాత్రి నుంచి ప్రత్యేక తనిఖీలు

- 31వ రాత్రి 8 నుంచి 1వ తేదీ తెల్లవారుజాము 5 గంటల వరకు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైన, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.
- ఆకతాయిలను, మితిమీరి ప్రవర్తించే వారిని, రోడ్లపై చిందులు తొక్కే మందుబాబులను ఇష్టానుసారంగాను మద్యం సేవించి వాహనాలను నడిపేవారిని బాడీ వార్న్ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.
- వాహనాలను అతి వేగంగా నడపడం, సైలెన్సర్ తీసి, హారన్స్ అదే పనిగా మోగించి శబ్ద కాలుష్యం చేసే వాహనాలను, రాంగ్ రూట్లలో డ్రైవింగ్, వాహనంపై విన్యాసాలు, జిగ్ జాగ్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసే వారిని నిరోధించడానికి ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపుతున్నారు.
- డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపైన క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయనున్నారు.
- అనుమతి లేని ప్రాంతంలో వాహనాలు పార్కింగ్ చేస్తే టోయింగ్ చేసి కేసు నమోదు చేస్తారు.

బీచ్ సందర్శకులకు సూచనలు

- నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డ్రోన్ కెమెరాలతో బీచ్ పరిసర ప్రాంతాల్లో నిఘా పెడుతున్నారు.
- బీచ్‌లో బాణసంచా కాల్చకూడదు.
- నూతన సంవత్సరం సందర్భంగా సందర్శకులు బీచ్‌లో రాత్రి సమయంలో సముద్ర స్నానానికి దిగకూడదు.
- శుభాకాంక్షలు తెలిపే నెపంతో ఇతర మహిళల చేతులను పట్టుకొని వేధించడం, అసభ్యకర పద జాలం ఉపయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు.
- డ్రగ్స్ వినియోగం పూర్తిగా నిషిద్ధం, చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరం. డ్రగ్స్ వినియోగించి పట్టుబడితే వారితో పాటు కార్యక్రమం నిర్వహించిన యాజమాన్యం, నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేయనున్నారు.
- నగర పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానం కలిగినా సీపీ వాట్సాప్ నంబర్ 9493336633, పోలీసు హెల్ప్‌లైన్ 112కు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని నగర పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీచ్‌కు వచ్చే వారికి పార్కింగ్

- సీఆర్ రెడ్డి జంక్షన్, ఆల్ ఇండియా రేడియో వైపు నుంచి వచ్చే వాహనదారులు వారి వాహనాలను జాయింట్ కలెక్టర్ బంగ్లా పక్కన ఉన్న పార్కింగ్ స్థలంలోను, ఏపీఐఐసీ గ్రౌండ్‌లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- కలెక్టర్ ఆఫీస్, కోస్టల్ బాటరీ, నౌరోజీ రోడ్, పందిమెట్ట వైపు నుంచి వచ్చే వాహనదారులు గోకుల్ పార్క్‌లో వాహనాలు నిలపాలి.
- సిరిపురం, పార్క్ హోటల్ వైపు నుంచి వచ్చే వారు ఆంధ్రాయూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోను, పోలీస్ ఆఫీసర్స్ మెస్ వెనుక వైపున పార్క్ చేసుకొని బీచ్ రోడ్డులోకి రావాలి.
- సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనలు ప్రకారం సరైన సమయానికే కార్యక్రమాలు ముగించాలి.
- వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేసేందుకు స్థలాన్ని కేటాయించి అదనపు సెక్యూరిటీ సిబ్బందిని వినియోగించాలి.

సీఎం జగన్ నిర్ణయం శిరోధార్యం



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ మేరకు ముఖ్యమంత్రి నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. గాజువాక నియోజకవర్గం నుంచి ఎవరికి టికెట్ ఇచ్చినా ఆ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. పార్టీ కోసం పని చేసిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విషయాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. గాజువాక అభ్యర్థి విషయమై మరోమారు ముఖ్యమంత్రితో మాట్లాడతామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'సీఎం జగన్ వెంటే ఉంటాం'



కొడూరు అప్పలరత్నం

మహారాణిపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే తమకు ఎంతో అభిమానమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే నడుస్తామని జీవీఎంసీ 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం(కొండమ్మ), వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. కొన్ని పత్రికలు పని గట్టుకుని దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తమపై తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.

పదవులు అనుభవించి పార్టీ మారితే ప్రజలు క్షమించరు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకుడు శ్రీవత్సవ

కొమ్మాది: ఓ పార్టీలో పదవులు అనుభవించి.. వేరే పార్టీలోకి మారితే ప్రజలు క్షమించరని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నుంచి ఎవరు బయటకు వెళ్లినా నష్టం లేదని.. త్వరలో భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీలో చేరికలు ఉంటాయన్నారు. సీతంరాజు సుధాకర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించినా.. కొన్ని ప్రలోభాలకు లొంగి పార్టీ మారారని ఆరోపించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. పార్టీలో ఇంతటి గౌరవం ఇచ్చినా సుధాకర్ పార్టీ మారడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సుధాకర్ పార్టీలోనే ఉంటే భవిష్యత్‌లో ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు.

బ్రాహ్మణులకు పెద్దపీట

రాష్ట్ర చరిత్రలోనే బ్రాహ్మణులకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని పార్టీ ముఖ్య నేత ద్రోణంరాజు శ్రీవత్సవ అన్నారు. ఈ పార్టీలో అన్ని సామాజిక వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్‌రావుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని.. కొన్ని కారణాల వలన ఓడిపోయినప్పటికీ వీఎంఆర్డీఏ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. సీతంరాజు సుధాకర్‌కు పార్టీలో ఉన్నత విలువ ఇచ్చినప్పటికీ నిలబెట్టుకోలేకపోయారని.. భవిష్యత్‌లో ఆయన భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు.

ప్రజా ప్రతినిధులే పారిశుధ్య కార్మికులై..

- పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు చీపురుపట్టారు
- రోడ్లు ఊడ్చిన ఎంపీ, మేయర్
- సమ్మె విరమించాలని విజ్ఞప్తి



కాలనీ వాసులతో కలసి చెత్తను తొలగిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పెదగదిలిలో చెత్త ఊడ్చుతున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



తోటగరువులో చెత్త ఊడ్చుతున్న స్థానికులు

ఆరిలోవ: పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రజా ప్రతినిధులే పారిశుధ్య కార్మికులయ్యారు. తెల్లవారే సరికి చీపురు పట్టుకుని.. వీధుల్లో చెత్తను ఊడ్చేశారు. ఆ చెత్తను ఎత్తి జీవీఎంసీ పారిశుధ్య వాహనాల్లో వేసి బయటకు తరలించారు. స్థానికులు సైతం తలో చేయి వేసి సహకారం అందించారు. పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ప్రజల సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ.. వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన వచ్చింది. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు రోడ్లపై చెత్త ఊడ్చారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఈ సమస్య తీరింది. ఎంపీ ఎంవీవీ సత్యానారాయణ సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

పెదగదిలిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చీపురు పట్టి చెత్త ఊడ్చారు. 11వ వార్డులో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి గొలగాని శ్రీనివాస్, స్థానిక నాయకులతో కలసి బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, డ్రైవర్స్‌కాలనీల్లో చెత్తను ఊడ్చారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 52వ వార్డులో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. 9వ వార్డులో కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెత్త నిల్వలను బయటకు తరలించారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత, నాయకులతో కలసి ఆరిలోవ కాలనీలో చెత్త కుప్పలు ఊడ్చి శుభ్రం చేశారు. తోటగరువులో కొందరు స్థానికులు చీపుర్లు పట్టుకుని చెత్తను ఊడ్చి సహకరించారు. కాగా.. పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అక్కడక్కడ కార్మికులు అడ్డుకున్నారు. వారిని పోలీసులు చెదరగొట్టడంతో కొంత గందరగోళం నెలకొంది.

ప్రజల ఆరోగ్యం ముఖ్యం

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ముఖ్యమన్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా నగరంలో చెత్త పేరుకుపోయిందన్నారు. చెత్త ఊడ్చి శుభ్రం చేయడానికి తనతో పాటు సిద్ధమైన కార్పొరేటర్లు, జీవీఎంసీ యంత్రాంగానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సమ్మె విరమించి.. విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు డంపర్‌బిన్లలో మాత్రమే చెత్త వేయాలని సూచించారు. ప్రైవేట్ కార్మికులను అడ్డుకోవద్దని.. వారి విధులకు ఆటంకం కలిగించవద్దని సమ్మె చేస్తున్న కార్మికులను కోరారు.

1న జూ తెరిచే ఉంటుంది

ఆరిలోవ: నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న జూ పార్కు తెరుస్తామని క్యూరేటర్ నందనీ సలారియా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూ పార్కుకు సాధారణంగా సోమవారం సెలవు ఉంటుంది. సందర్శకుల సౌకర్యార్థం ఈ సోమవారం జూ తెరుస్తామని, ఇందుకు బదులుగా రెండో తేదీ మంగళవారం సెలవు ప్రకటించామన్నారు. తర్వాత వచ్చే సోమవారాల్లో యథావిధిగా సెలవు కొనసాగుతుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను సిటు మభ్యపెడుతోంది

- ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలన్న దురుద్దేశం కనిపిస్తోంది
- త్వరలోనే ఐఆర్ రానుంది.. కార్మికుల డిమాండ్ నెరవేరుతుంది
- సమ్మె విరమించి విధుల్లోకి రావాలి
- గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు



మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న ఆనందరావు(ఫైల్)

డాబాగార్డెన్స్: పారిశుద్ధ్య కార్మికులకు వాస్తవాలు తెలపకుండా సిటు మభ్యపెడుతోందని, ముఖ్యంగా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలన్న దురుద్దేశంతోనే కార్మికులను రోడ్డుపైకి తీసుకొచ్చిందని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహాదేవ్ ఆనందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేయడం వల్ల కార్మికులకు ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. త్వరలోనే ఐఆర్ రానుందని, దీంతో కార్మికుల డిమాండ్ నెరవేరనుందని చెప్పారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో భేటీ అయ్యామని, పలు డిమాండ్ల పరిష్కారానికి ఆయన మొగ్గు చూపారన్నారు. జీవీఎంసీ మెయిన్‌గేట్‌కు ఎదురుగా ఉన్న యూనియన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము సమ్మెకు వ్యతిరేకం కాదని.. అయితే ఇప్పుడు సమ్మె చేయాల్సిన పరిస్థితులు లేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటూ.. కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ ఒకే వేతనం ఉండాలన్నదే ప్రభుత్వ నిర్ణయమన్నారు. రాష్ట్రంలో 40 వేల మంది ఆప్కోస్ కింద, మరో 60 వేల మంది వివిధ విభాగాలతో పాటు 1.80లక్షల మంది కార్మికులు అనేక విభాగాల్లో పనిచేస్తున్నారని వివరించారు. మొత్తంగా 2.80 లక్షల మంది కార్మికులకు న్యాయం చేయడానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నా రు. ఇప్పటికే ప్రభుత్వం పీఆర్‌సీ కమిటీ వేసిందని, చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. తక్షణమే ఐఆర్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐఆర్ విడుదలైతే కార్మికుల డిమాండ్ నెరవేరనుందన్నారు. కొంతమంది కార్మికులు సమ్మె చేస్తున్న దృష్ట్యా మరి కొంత మంది వి ధులు నిర్వహిస్తుంటే ఆటంకాలు సృష్టిస్తున్నారని.. అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ విషయమై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే పీఆర్‌సీ ఇస్తున్న నేపథ్యంలో కార్మికులు ఆలోచించి విధులకు హాజరుకావాలని కోరారు.

మున్సిపల్ శాఖ మంత్రితో చర్చించాం

మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో ఈ నెల 28న చర్చలు జరిగాయని ఆనందరావు చె ప్పారు. పీహెచ్ డ్రైవర్లు, యూజీడీ వర్కర్స్, మలేరియా, పార్కుల్లో పనిచేస్తున్న వారందరికీ హెల్త్ అలవెన్స్ అమలు, సూపర్‌వైజర్లు, యాక్టింగ్ డ్రైవర్స్‌కు జీవో 7 ప్రకారం రూ.18,500 చెల్లిస్తూ హోదా కల్పిస్తామని మంత్రి చెప్పారన్నారు. నీటి సరఫరా విభాగం కెనాల్‌లో పని చేస్తున్న 105 మందికి, పదేళ్ల అనుభవం ఉండి ఐటీఐ సర్టిఫికెట్ ఉన్న 119 మందికి జీవో 7 ప్రకారం రూ.18,500 చెల్లిస్తామని, ఇంజినీరింగ్ విభాగంలో హై స్కిల్డ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీలుగా విభజిస్తూ ఏపీడీసీఎల్‌లో అమలు పరిచే విధంగా ఇంజినీరింగ్, నీటి సరఫరాలో కూడా జీవో 30ని రివైజ్ చేస్తూ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేస్తామని, వారాంతపు సెలవులు, 9 జాతీయ పండగ సెలవులు, 15 క్యాజువల్ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయమని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అవుట్ సోర్సింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు పరిచే విషయం కేబినెట్ సబ్‌కమిటీ దృష్టిలో పెడతామన్నారు. చనిపోయిన, 60 ఏళ్లు పూర్తయిన, సిక్ అయిన అవుట్ సోర్సింగ్ కార్మికుల పోస్టుల్లో వారి కుటుంబ వారసులకు ఆప్కోస్ గైడ్‌లైన్స్ ప్రకారం ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారన్నారు.

వైఎస్సార్ టీయూసీ అనుబంధమే..

గ్రేట్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్.. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధమేనని ఆనందరావు స్పష్టం చేశారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి తమ యూనియన్‌కు అనుబంధ సర్టిఫికెట్ ఇచ్చారని ఆయన వెల్లడించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



డాబాగార్డెన్స్: పారిశుద్ధ్య నిర్వహణలో అంతరాయం దృష్ట్యా ప్రజలందరూ తమ వంతు బాధ్యతగా జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. వీధులు, గెడ్డలు, కాలువలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు వేయవద్దని, సమీపంలోని డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున.. పారిశుద్ధ్య నిర్వహణ పనులకు అంతరాయం కలుగుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. సమ్మె కాలంలో ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ అన్ని జోన్లలో ప్రైవేట్ వాహనాలు, కార్మికుల ద్వారా తాత్కాలిక పద్ధతిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. నగర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రైవేట్ కార్మికుల విధులకు ఆటంకం కలిగించవద్దన్నారు. సమ్మెకు స్వస్తి చెప్పి విధుల్లో చేరాలని పారిశుద్ధ్య కార్మికులను కోరారు. పరిశుభ్రతలో ఏటా విశాఖ నగరం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని.. దీనిని కొనసాగించాల్సిన అవసరం మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

గొప్ప విప్లవకారుడు నండూరి ప్రసాదరావు

ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్



మాట్లాడుతున్న ప్రభాత్ పట్నాయక్

డాబాగార్డెన్స్: గొప్ప విప్లవకారుడు, కార్మిక పక్షపాతి నండూరి ప్రసాదరావు అని, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వ్యక్తి ఎన్‌పీఆర్ అని, ఆయన స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. సిటూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు 23వ వర్ధంతి పురస్కరించుకొని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచీకరణ–నిరుద్యోగం పరిష్కార మార్గాలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముందుగా ఎన్‌పీఆర్ చిత్రపటానికి ప్రభాత్ పట్నాయక్, సీహెచ్ నరసింగరావు, ఎంవీఎస్ శర్మ, పి.మణి, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కేఎం శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నయా ఉదారవాద విధానాలు అమలు చేయడంతో ఫాసిస్ట్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. ప్రజలపై భారాలు పడకుండా ఉండాలన్నా, పన్నులు లేకుండా చేయాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు తగ్గించాలన్నా దేశ జనాభాలో ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల సంపదపైన, వారసత్వ సంపదపైన 2 శాతం పన్ను విధించినట్టయితే పరిష్కారమవుతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలని, వాటి ద్వారానే నిరుద్యోగం లేకుండా రూపుమాపవచ్చని అభిప్రాయపడ్డారు. సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ నండూరి ప్రసాదరావు విశాఖ కార్మిక పోరాటాలకు కీలక పాత్ర పోషించారన్నారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఏయూ పూర్వ ప్రొఫెసర్ కె.నళిని, రెడ్డి వెంకట్రావు, కేఎం శ్రీనివాస్, యు.రామస్వామి, బి.జగన్, పి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మంత్రి బొత్స సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను శనివారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయుల సంఘ సభ్యులు కలిశారు. సమస్యల పరిష్కారం కోసం వారు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయ సంఘాలకు తానెప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. సమస్యలు పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.



మంత్రి బొత్సకు వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

గిరిజన మ్యూజియంలో సాంస్కృతిక వైభవం

- థింసా నృత్యాలతో పర్యాటకులకు జోష్
- అలరించిన వివిధ కళాకారుల ప్రదర్శనలు



బిందెలతో థింసా నృత్యం

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ గిరిజన మ్యూజియం ప్రాంగణంలో మర్రి కామయ్య సాంస్కృతిక కళావేదికపై సాంస్కృతిక వైభవం నెలకొంది. కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ల ఆదేశాల మేరకు శనివారం పర్యాటకుల సౌకర్యార్థంగా పలు కళారూపాల ప్రదర్శనలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా అరకులోయ అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులను ఉత్సాహపరిచేందుకు ఈ నెల 30, 31 తేదీల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టూరిజం సెల్ మేనేజర్ మురళి, గిరిజన మ్యూజియం నిర్వాహకులు తెలిపారు.

గిరిజన సంప్రదాయ థింసా నృత్యాలు, పలు కళా ప్రదర్శనలు తిలకించేందుకు పర్యాటకులు, స్థానికులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడంతో మరింత జోష్ పెరిగిందని వారు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. థింసా నృత్య కళాకారులతో కలిసి పర్యాటకులు కుటుంబ సమేతంగా సందడి చేశారు.



గిరిజనుల వైవిధ్య వాయిద్యం



థింసా నృత్యం చేస్తున్న గిరిజన యువతులు

వంజంగి హిల్స్‌కు పర్యాటకులు రావద్దు

- వచ్చే నెల రెండు నుంచి వారం రోజులపాటు మూసివేత
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి, పాడేరు: ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్‌ను వచ్చే నెల రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు వారం రోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వంజంగి రోడ్డుతో పాటు హిల్స్ ప్రాంతమంతా కాలుష్యంతో నిండి ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపుతో పాటు రహదారికి మరమ్మతులు చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులు ఈ విషయాన్ని గుర్తించి వంజంగి హిల్స్ సందర్శనను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు.